క్లుప్తంగా

చర్మంపై మచ్చలుంటే వైద్యులను సంప్రదించాలి

టెక్కలి: చర్మంపై ఎటువంటి మచ్చలు కనిపించినా తక్షణమే వైద్యులను సంప్రదించి కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని టెక్కలి గ్రామసచివాలయం-1 ఆరోగ్య సిబ్బంది సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించి కుష్టువ్యాధి నిర్ధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఆరోగ్య సిబ్బంది ఎస్.పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

11,300 టన్నుల ధాన్యం సేకరణ

సోంపేట: మండలంలోని 22 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు 11,300 టన్నుల ధాన్యం సేకరించినట్లు తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ధాన్యం కొనుగోలు అంచనా 11,400 టన్నులు వేసినట్లు పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి 11,300 టన్నుల ధాన్యం కనీస మద్దతుధరకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇంకా 900 మంది రైతులకు చెందిన 1955 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రానున్న కొన్ని రోజుల్లో అదనపు లక్ష్యం కేటాయించిన మేరకు కొనుగోలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా రైతు సేవా కేంద్రాలకు సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు కేటాయించిన కేంద్రాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో నంబర్ గదిని పోలింగ్ ప్రక్రియకు కేటాయించగా.. దీన్ని తహసీల్దార్ ఎన్.రమేష్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎస్ఐ పి.పారినాయుడు పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాంనాయుడు, స్థానిక వీఆర్వో బి.శ్రీనివాసరావు ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

టెక్కలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అమలు చేసిన కోడ్‌తో టెక్కలి మేజరు పంచాయతీ పరిధిలో వివిధ రకాల రాజకీయ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాతబస్‌స్టాండ్ వరకు ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభమైంది. ఫిబ్రవరి 27న ఎన్నికలు, మార్చి మూడో తేదీన లెక్కింపు ప్రక్రియ కాగా ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుంది.

డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు ప్రక్రియ



దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్‌పాడీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మంది విద్యార్థులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఓటరు నమోదుకి సంబంధించిన దరఖాస్తులను కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో సంతోష్‌కుమార్, మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు శివకుమార్, నాగేశ్వరరావు, రాధ, సీతమ్మ, త్రిపాఠి,బృందావనం ఉన్నారు.

నూతన సముదాయం ప్రారంభం



భవన సముదాయాలను ప్రారంభిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం రామక్రిష్ణాపురం గ్రామంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో నూతన భవన సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రశాంతి నిలయం మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ వీటిని ప్రారంభించి మాట్లాడారు. సత్యసాయి స్టేట్ ట్రస్ట్ కన్వీనర్ హెచ్.జె.దొర, ఎస్.జి.చలం, సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్ర, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి పాల్గొన్నారు.

పసివాడుతున్న బతుకులు!





ఇటుక బట్టీల్లో చిన్నారులు

- చదువుకు దూరంగా చిన్నారులు
- ఇటుక బట్టీల్లోనే పసివారు

ఇచ్ఛాపురం రూరల్:

పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. కూటి కోసం పొట్ట చేతబట్టుకొని కుటుంబాలతో చంటి పిల్లల్ని సైతం చంకలో పెట్టుకొని వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన కార్మికులకు పని దొరుకున్నప్పటికీ.. వారి పిల్లలకు మాత్రం విద్య, వైద్యం వంటి సౌకర్యాలు సమకూరడం లేదు. వీటిని అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందందనే విమర్శలు వస్తున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీతో పాటు కంచిలి, సోంపేట మండలాల్లో పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు ఉన్నాయి. సుమారు 200 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఒడిశా బొలంగిరి ప్రాంతం నుంచి వందలాది మంది కార్మికులు పనులు చేసేందుకు ఈ నియోజకవర్గానికి ఏటా నవంబర్ నెలలో వస్తుంటారు. ఆరు నెలలు ఇటుక బట్టీల్లో పనులు చేసి ఏప్రిల్, మే నెలలకు ఇళ్లకు వెళ్లిపోతుంటారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా నాన్ రెసిడెన్సీ సీజనల్ ట్రైనింగ్ సెంటర్స్ (ఎన్ఆర్ఎస్‌టీసీ)ను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయగా.. ఇటుక బట్టీలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అందుకోసం ఐదు వేల రూపాయల వేతనంతో వలంటీర్‌ను సైతం నియమించింది. ప్రస్తుతం కొత్తూరు, కంచిలి (గిరిజన), మెళియాపుట్టి, సారవకోట, పాతపట్నం మండలాల్లో తొమ్మిది ఎన్ఆర్ఎస్‌టీసీలు మాత్రమే ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వైద్యం పరంగా అప్పటి ప్రభుత్వం ప్రతీ ఇటుకబట్టీలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందజేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల పిల్లలను పూర్తిగా విస్మరించింది. దీంతో నియోజవర్గంలో సుమారు రెండు వందల మంది వరకు చిన్నారులు విద్య, వైద్యానికి దూరంగా ఉంటున్నారు. ఇటుకబట్టీ యజమానులు కొన్ని ప్రాంతాల్లో సొంతంగా వలంటీర్లను ఏర్పాటు చేసి మమా అనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుక బట్టీ కార్మికుల కోసం కనీసం 'సీజనల్ హాస్టళ్ల'ను అయినా ఏర్పాటు చేయాల్సిందిగా ఇటుకబట్టీ కార్మికులు కోరుతున్నారు.

సర్వే చేస్తాం..

ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నట్టు తమ దృష్టికి వచ్చింది. స్థానిక మండల విద్యాశాఖాధికారి నేతృత్వంలో సర్వే చేస్తాం. పిల్లల సంఖ్యబట్టి నాన్ రెసిడెన్సీ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పిల్లల భాష మాధ్యమాల్లో వలంటీర్లను నియమిస్తాం.

– పూడి జనార్దనరావు, ప్రత్యామ్నాయ పాఠశాలల ప్రతినిధి, శ్రీకాకుళం

ఇళ్ల స్థలాల కేటాయింపులు రద్దు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ వైఎస్సార్ సీపీ కాలనీలో ఐదుగురుకు కేటాయించిన ఇళ్ల స్థలాల పొజిషన్ రద్దు చేసినట్లు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 20వ తేదీన స్పందనలో గ్రామానికి చెందిన అనపాన నగేష్ డ్రైనేజీ సమస్యపై లచ్చయ్య ఒడ్డు చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని రోడ్డు వేశారని ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆర్డీవో శుక్రవారం పరిశీలించారు. సాంఘీక సంక్షేమ నివాసానికి సంబంధించిన స్థలమని, దానికి తోడు తప్పుడు సర్వే నంబర్‌లో ఇంటి స్థలాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ల్ ఇవ్వడం వల్ల వాటిని రద్దు చేసినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని చదును చేసి ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పంచాయతీ సిబ్బందికి ఆర్డీవో ఆదేశించారు. లచ్చయ్య ఒడ్డు చెరువుపై సర్వే చేసి ఆక్రమణలు వెంటనే తొలగించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్ఐ ప్రసన్న, వీఆర్వో మంగులు ఉన్నారు.

ఉన్నత ఆలోచనలతో మెలగాలి

- డీఈవో తిరుమల చైతన్య



విద్యార్థులతో మాట్లాడుతున్న తిరుమల చైతన్య

పలాస: మన ఆలోచనలు ఉన్నతంగా ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి టెన్త్, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కొడితే సిక్స్ కొట్టాలిరా అని చాలా మంది సక్సెస్ కోసం చెబుతుంటారు.. మరికొంత మంది కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలిరా అంటారన్నారు. వీటిని ఏ రంగంలోనైనా విజయాలు పొందడానికి వాడిన పదజాలాలన్నారు. వీటిని విద్యార్థులు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అన్ని మనలోనే ఉంటాయని, మనం ఏవిధంగా ఆలోచిస్తామో మన భవిష్యత్తు కూడా అలాగే ఉంటుందని చెప్పారు. ఇష్టపడి చదివితే కష్టమంటూ ఉండదన్నారు. సరైన ఆహారం తీసుకొని సుమారు ఏడు గంటల పాటు నిద్రపోతే ఎటువంటి మానసిక ఒత్తిడి ఉండదన్నారు. ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ప్రతి మనిషికి చరిత్రలో ఒక పేజీ ఉండాలంటే విద్యార్థి దశలోనే తగిన కష్టం చేయాలని.. అంతకు మించినది మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, సైన్సు ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



దూడకు వ్యాక్సిన్ చేస్తున్న ఏడీ డాక్టర్ చంద్రశేఖరరావు

కాశీబుగ్గ: పలాస, మందస మండలాల్లోని పలు గ్రామాల్లో జనవరి 20 నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. పలాస ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పి.చంద్రశేఖరరావు వాటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నట్టలు, నులిపురుగుల నివారణ మందులను జీవాలకు వేశామన్నారు. జనవరి 20 నుంచి 31వతేదీ వరకు అన్ని గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించామన్నారు. పశువైద్య శిబిరాల్లో వైద్యులు శ్రీకాంత్, డాక్టర్ ఉమాభారతి, డాక్టర్ మధుబాబు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై అంధకారం!



అంధకారంలో ఫ్లైవర్ వంతెన

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల బెండి గేట్ ఫ్లైఓవర్ వంతెనపై కొంత కాలంగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంది. దీంతో రాత్రి సమయంలో వాహనాల రాకపోకతో పాటు పాదాచారులు నడిచే ఈ వంతెన చీకటిగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రధానంగా బెండి గేట్, కాశీబుగ్గ, టెక్కలితో పాటు ఒడిశా వెళ్లాలంటే ప్రధాన వంతెన కూడలి ఇది. అయితే విద్యుత్ దీపాలు ఉన్నా..నిరుపయోగంగా మారడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కాగా ఇదే ప్రాంతంలో ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదం జరిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. అలాగే ఓ మహిళ మెడలో బంగార ఆభరణాన్ని దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చి దొంగిలించిన సంఘటన జరిగింది. అధికారులు స్పందించి వంతెనపై విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రపతికి అంగన్‌వాడీ కార్యకర్తలు అర్జీలు



రాష్ట్రపతికి పంపించేందుకు సిద్ధం చేసిన అర్జీలతో అంగన్‌వాడీ కార్యకర్తలు

టెక్కలి: అంగన్‌వాడీ కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అర్జీలు పంపుతున్నట్లు యూనియన్ నాయకులు బి.రమణమ్మ, సీహెచ్ ఇందిర తెలిపారు. శుక్రవారం కార్యకర్తలంతా లిఖితపూర్వకమైన అర్జీలను రాశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రెగ్యులర్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.హేమావతి, కె.ధనలక్ష్మి, కె.లక్ష్మీకాంతం, సుమిత్ర పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

టెక్కలి రూరల్: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని కోటబొమ్మాళి మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. శుక్రవారం వీధి బాలల దినోత్సవం సందర్భంగాగా కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధిబాలల దినోత్సవం జరుపుకోవడం బాధాకరమన్నారు. ఎక్కడైనా వీధిబాలలు కనిపిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేసి అప్పగించాలని లేదా సమీపంలో స్వచ్ఛంద సంస్థలకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లల ఎదుట తల్లిదండ్రులు అసభ్యకర పదజాలం వాడరాదన్నారు. సమావేశంలో ఏజీపీ తిరుపతి, న్యాయవాదులు బి.నారాయణరావు, తిరుమలరావు, నరసింహమూర్తి, మన్మథరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం:

ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కార్మికుల కోసం కేటాయించిన మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రొహిబిషన్ సీఐ పి.దుర్గాప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో శ్రీశయన, మండలంలో గౌడ, కవిటి మండలంలో శ్రీశయన సామాజిక వర్గాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఈ నెల ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ప్రభుత్వం నిర్దేశించిన రూ. 2 లక్షలు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి ఏడో తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి దుకాణాలను కేటాయిస్తామన్నారు.

భిన్నలమదనాపురంలో ఉచిత వైద్య శిబిరం



శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం భిన్నలమదనాపురం గ్రామంలో గాయత్రీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కోర్ల కన్నారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి గైనిక్ వైద్యురాలు డాక్టర్ జస్సీ, ఆర్థో వైద్యుడు డాక్టర్ జగదీష్‌లు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మార్పు వెంకటేశం,కారి ఈశ్వరరావు, కొంచాడ సురేష్, కరుణాకర్, మధుబాబు, జయరాం పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



పాపారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ల్యాండ్ సర్వే డైరెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. నౌపడ పంచాయతీ సీతానగరం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేసి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన బొడ్డేపల్లి పాపారావు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇదే మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పని చేసి గ్రూప్-1 ఆఫీసర్‌గా మీ ముందున్నానిని, ప్రతి విద్యార్థి తన లక్ష్యం చేరిన వరకూ శ్రమించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనదని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారని అన్నారు. అంతకుముందు దాత పాపారావు మాస్టార్ ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు.

సేవలతోనే గుర్తింపు



శంకరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ ఉద్యోగికి విధి నిర్వహణలో తాను చేసిన సేవలే సమాజంలో గుర్తింపు, గౌరవాన్ని తీసుకొస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, హెచ్ఎం సనపల రామకృష్ణలు అన్నారు. బొరివంక జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గరుడాచలం శంకరరావు మాస్టార్, జ్యోతి దంపతులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయవృత్తిలో కొనసాగి, పాఠ్య పుస్తక రచయతల బృందంలో సభ్యుడిగా విశేషమైన సేవల్ని అందించిన శంకరరావు మాస్టారు సేవలు ప్రశంసనీయమైనవని వక్తలు కొనియాడారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు మార్చి నెలలో జరగనున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో వారికి ఇబ్బంది లేకుండా నావంతు సేవలను అందిస్తానని ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పలు పాఠశాలల హెచ్ఎంలు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధ్యాపకుల ప్రచారం..

రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలని కోరుతూ అధ్యాపకులు శుక్రవారం పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రచారం చేశారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, లీలాపద్మజ, ఝాన్సీరాణి, సంతాన్ తదితరులు స్థానిక జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. –టెక్కలి



ఆలయ ప్రతిష్ట..

సంతబొమ్మాళి మండలం నౌపడలో భూలోకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం మొదటి రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో హోమం కాల్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ధర్మకర్త దల్లిరాజు దంపతులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. –సంతబొమ్మాళి



సింహద్వారం ఏర్పాటు..

కవిటి మండలంలోని రాజపురంలోని లిమ్మాకుని అమ్మవారి ఆలయ సింహద్వార ప్రతిష్ట శుక్రవా రం వైభవంగా జరిగింది. ఆలయం 20వ వార్షికోత్సవంలో భాగంగా వేకువజాము నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్నవారు, స్థానిక రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో రూ.8 లక్షల విరాళాలతో సింహద్వారాన్ని నిర్మించారు. మధ్యాహ్నం భక్తులు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. –కవిటి



ఇదేమి 'చెత్త'పని..

పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామం మధ్యలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. వ్యాపార కూడలైన ఈ ప్రాంతానికి దుస్తులు, కంచర, వివాహ సామగ్రి కొనుగోలు కోసం జనం రోజూ వస్తుంటారు. ఇక్కడ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడం, అధికారుల సమన్వయలోపంతో పారిశుద్ధం క్షీణించింది. పేరుకుపోయిన చెత్తతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. –కాశీబుగ్గ

తుఫాన్ షెల్టరే సచివాలయం!

- విరిగిన తలుపులు, కిటికీలతో రికార్డులు, కంప్యూటర్లకు భద్రత కరువు



శిథిలమైన తుఫాన్ షెల్టర్‌లో నడుస్తున్న సచివాలయం

సంతబొమ్మాళి: నౌపడ సచివాలయం-2 సొంత భవనానికి నోచుకోలేదు. దీంతో శిథిలమైన తుఫాన్ షెల్టర్‌లో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థలో ఉండడంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సచివాలయం పరిధిలో నౌపడ పంచాయతీలోని కూర్మనాధపురం, జగన్నాధపురం, పాలనాయుడుపేట, ఇజ్జువరం పంచాయతీలోని ఇజ్జువరం, వల్లపురం, రాజగోపాలపురం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ కనీసం మౌలిక వసతులు కూడా లేవు. దీంతో సిబ్బందితో పాటు ఇక్కడకు వచ్చే ప్రజలు అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నార. షెల్టర్‌లోని అన్ని గదులలో ఉన్న కిటికీలు, ప్రవేశ ద్వారం తలుపులు కూడా విరిగిపోయాయి. దీంతో కంప్యూటర్లు, రికార్డులు, ఇతర విలువైన వస్తువులకు రక్షణ లేకుండా పోయింది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి యు.ఉమాపతి వద్ద ప్రస్తావించగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సచివాలయాన్ని పాత పంచాయతీ కార్యాలయం భవనంలోకి మార్చాలని ఎంపీడీవోకు సైతం లిఖిత పూర్వకంగా కోరినట్టు పేర్కొన్నారు.



కిటికీలు విరిగి ఉన్న గది

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

కాశీబుగ్గ: బస్సు ఎక్కండి గిఫ్ట్ కొట్టండి అంటూ పలాస ఏపీఎస్ ఆర్‌టీసీ, జీఎస్‌వీ జ్యూయలర్స్ వారి సౌజన్యముతో ప్రయాణికుల కోసం బహుమతులను ప్రకటించారు. దీనికి సంబంధించి శుక్రవారం కాశీబుగ్గ రాజీవ్‌గాంధీ బస్సు స్టాండ్‌లో లక్కీడ్రా తీశారు. ప్రయాణికుల కోసం అమలు చేసిన ప్రక్రియ పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారామనాయుడు ఆధ్వర్యంలో జరగ్గా.. డ్రాల్లో విజేతలుగా బెంకిలీ గ్రామానికి చెందిన పొందరి శ్రావణి గ్రైండర్ గెలుచుకోగా.. కవిటి గ్రామానికి చెందిన సుధాసాహు ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్, శాశనాం గ్రామానికి చెందిన మహంతి దీనబంధు నాన్ స్టిక్ కడాయిని బహుమతిగా అందజేశారు.

విద్యార్థినికి సత్కారం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.బింధురెడ్డిని అధ్యాపక సిబ్బంది శుక్రవారం సత్కరించారు. మొదటి ఏడాది పరీక్షల్లో 470కి 457 మార్కులు సాధించడంతో జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన బేటీ బచావో- బేటీపడావో కార్యక్రమంలో అధికారులు అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాలలో కూడా ప్రిన్సిపాల్ శంకర్‌రావు సమక్షంలో సత్కరించారు.